క్లుప్తంగా

అమ్మవారికి పల్లకీ సేవ



స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులుగావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.

నూతన భవనాలు నిర్మిస్తాం



శిథిలమైన షాపింగ్ కాంప్లెక్స్‌ను మూసివేస్తున్న మున్సిపల్ అధికారులు

ఆత్మకూరు: పట్టణంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు చెప్పారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 42 ఏళ్ల క్రితం ఆత్మకూరు పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ గదులు శిథిలావస్థకు చేరడంతో వాటిని కూల్చి వేస్తున్నట్లు తెలిపారు. వాటి స్థానంలో నూతన గదులు నిర్మించి టెండర్ల ద్వారా షాపులను కేటాయించడం జరుగుతుందన్నారు. పాత కాంప్లెక్స్‌ను కూల్చి వేయాలని తీర్మానాన్ని గత కౌన్సిలర్లు ఆమోదించారని చెప్పారు. త్వరలోనే నూతన భవనాలను ఏర్పాటు చేస్తామన్నారు.

మేకలబండ చెంచుగూడెం దత్తత



చెంచుగిరిజనులతో సమస్యలపై చర్చిస్తున్న పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: నంద్యాల జిల్లా పరిధిలో 42 చెంచు గిరిజన గూడేలకు జిల్లాస్థాయి, మండల స్థాయి అధికారులకు దత్తుగా ప్రకటించారు. ఇందులో భాగంగా శ్రీశైలంలోని మేకల బండ చెంచుగూడేన్ని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డి దత్తత తీసుకున్నారు. ఈ మేరకు ఆదివారం గిరిజనులతో సమావేశం నిర్వహించారు. గిరిజనులకు నివాసగృహాలు, టాయిలెట్స్, డ్రైనేజీ సదుపాయాలు అవసరం ఉన్నట్లుగా సమావేశంలో గుర్తించారు. ఈ గూడేనికి అవసరమైన సదుపాయాల ఏర్పాటుకు తగిన నిధుల మంజూరు కోసం జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు చెంచుగిరిజనులకు పీఓ తెలిపారు.

సారాబట్టీలు ధ్వంసం



సారాబట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు: మండలంలోని సిద్దాపురం గ్రామ శివారులో నాటుసారా బట్టీలపై సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో దాదాపు 500 లీటర్ల బెల్లం ఊటను పారబోసినట్లు సీఐ తెలిపారు. సారా విక్రయించినా , సారా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా తయారు చేయడం, విక్రయించడం నేరమన్నారు. దాడుల్లో ఎస్ఐ కృష్ణమూర్తి, సిబ్బంది శ్రీను, బాలకృష్ణ, షేక్షావలి, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు

అర్చకునికి నివాళి

శ్రీశైలం: శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయంలో అర్చకులుగా పనిచేస్తున్న శివనాగప్రసాద్ శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. దేవస్థానం ఉద్యోగులు, ఉభయ దేవాలయాల అర్చకులు, సిబ్బంది ఆదివారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శివనాగప్రసాద్ కుటుంబాన్ని దేవస్థానం ఈఓ , కమిషనర్‌లు ఆదుకోవాలని, ఆయన భార్యకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం వచ్చేలా చూడాలని కోరారు.

మల్యాలలో షరాఫ్ వేలం



పోలీసు బందోబస్తు మధ్య వేలం పాట

నందికొట్కూరు: మండలంలోని మల్యాల రైతు సంఘం అధ్యక్షుడిగా తలారి ఎల్ల నాయుడును రైతులు, గ్రామ ప్రజలు, గ్రామ సర్పంచు ఉమాదేవి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం గ్రామం నడిబొడ్డున గ్రామ షరాఫ్ వేలం పాటలు పోలీసుల సమక్షంలో నిర్వహించారు. తలారి చంద్ర శేఖర్ నాయుడు రూ.3,50,000లకు వేలం పాట దక్కించుకున్నారు.

‘పది’ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేటి నుంచి పబ్లిక్ పరీక్షలు
- సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- విద్యార్థులకు అన్ని సౌకర్యాలు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్విజిలేటర్లకు అవగాహన కల్పిస్తున్న పరీక్షల చీఫ్ అబ్దుల్ రెహమాన్

ఆత్మకూరు: ఈ నెల 3వ తేదీ నుంచి నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయలు కల్పించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సిద్ధం చేశారు.

జిల్లాలో 125 పరీక్ష కేంద్రాలు

నంద్యాల జిల్లాలో 125 సెంటర్లకు గాను 25,411 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. ఇందుకు 1,314 మంది ఉపాధ్యాయలను ఇన్విజిలేటర్లుగా నియమించారు. శ్రీశైలం నియోజకవర్గంలో ఆత్మకూరు మండలంలో 1,214 మంది విద్యార్థులకు 5 పరీక్ష కేంద్రాలు, శ్రీశైలం మండలంలో 597 మంది 3 కేంద్రాలు, వెలుగోడు 3 పరీక్ష కేంద్రాల్లో 639 మంది, బండిఆత్మకూరులో 697 మంది 3 కేంద్రాలు, మహానంది మండలంలో 349 మంది విద్యార్థులకు 2 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు పట్టణంలో 1470 మంది విద్యార్థులుండగా 6 పరీక్ష కేంద్రాలు, జూపాడుబంగ్లా 480 మంది 2 కేంద్రాలు, మిడుతూరు 400 మంది 2 ,కొత్తపల్లిలో 2 పరీక్ష కేంద్రాల్లో 380 మంది పరీక్షలు రాయనున్నారు. అలాగే పాములపాడు, పగిడ్యాల మండలాల్లో 310, 380, విద్యార్థులుండగా 2 చొప్పున కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని పాఠశాలల్లో కావాల్సిన సౌకర్యాలు కల్పించారు. పరీక్షలు రాసేందుకు బెంచీలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం, ఉచిత వైద్య వైద్య సదుపాయం అందుబాటులో ఉంచారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు రాయనున్నారు. పరీక్షల చీఫ్ ఆధ్వర్యంలో అన్ని పరీక్షా కేంద్రాల్లో శనివారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

నో సెల్ జోన్ ...144 సెక్షన్ అమలు

జిల్లాలోని అన్ని పరిక్షా కేంద్రాలతో పాటు శ్రీశైలం నందికొట్కూరు నియోజకవర్గాల్లోన్ని అన్ని పరిక్షా కేంద్రాల వద్ద 144 వ సెక్షన్‌తో పాటు , పోలీస్ గస్తీ ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. అలాగే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సమయానికి చేరుకునేలా బస్సులు ఏర్పాటు చేశారు. పరీక్షల అనంతరం విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఆర్టీసీ అధికారులు కల్పించారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, పరీక్షల చీఫ్, డిపార్ట్‌మెంట్ సిబ్బంది సైతం సెల్‌ఫోన్లు తీసుకొనివెళ్లడం నిషేధించారు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించి హాల్‌లోకి పంపనున్నారు. సెల్‌ఫోన్ ఎవరు తీసుకువెళ్లినా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా విద్యార్థులు ఉదయం 8.30 నిమిషాలకు అంటే పరిక్ష ప్రారంభమయ్యే అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తాం



జిల్లాలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలు చేరుకోవాలి. ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పగడ్బందీ చర్యలు తీసుకున్నాం. పరీక్ష కేంద్రాల్లోని ఉన్నతాధికారులతో సహా ఎవరూ సెల్‌ఫోన్ తీసుకెళ్లరాదు. ఎక్కడ మాస్‌కాపీయింగ్ పాల్పడినా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం.

–అనురాధ, నంద్యాల డీఈఓ

రేపు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

మిడుతూరు: మండల పరిధిలోని ఉప్పలదడియ గ్రామంలోని రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు (ఆరుపండ్ల విభాగంలో) నిర్వహిస్తున్నట్లు కమతం జయరామి రెడ్డి ఆదివారం తెలిపారు. శ్రీ రామనవమి, రంజాన్, గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు నగదును అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఎడ్ల జతకు రూ.3 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేస్తామన్నారు. ఆసక్తి కల ఎడ్ల యజమానులు రూ. 500 ఎంట్రీఫీజు చెల్లించి టోకన్లు పొందాలని చెప్పారు. వివరాలకు..9959435354, 9866416512, 9618446391 నంబర్లలో సంప్రదించాలన్నారు.

6వ తేదీ జీ.వీరాపురంలో..

కొత్తపల్లి: మండలంలోని జీ.వీరాపురం గ్రామంలో ఈనెల ఆరవ తేదీన సుంకుల పరమేశ్వరి దేవి జయంతి సందర్భంగా గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఆరుపండ్ల విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 6వ తేదీ ఉదయం 8 గంటలలోపు ఎద్దుల యజమానులు ప్రవేశ రుసుము రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. విజేతలకు రూ.30 వేలు, రూ.25వేలు, రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10, రూ.5వేలు బహుమతులు అందజేస్తాన్నారు. వివరాలకు 9963019710, 9866783974, 9951053466 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



కిట్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలో ఏ క్షణంలో ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని శ్రీశైలం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్ద పీటవేశారన్నారు. ఆర్థిక, రాజకీయ రంగాలతో పాటు అన్ని రంగాల్లో నిరుపేదల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అందులో భాగంగా అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన లాంటి ఎన్నో పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. అనంతరం కన్వీనర్లకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు, వెలుగోడు, శ్రీశైలం మండలాల అధ్యక్షులు అంజాద్‌అలీ, రాజమోహన్‌రెడ్డి, వట్టి వెంకటరెడ్డి, విజయచౌదరి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

జూపాడుబంగ్లా: సోమవారం నుంచి ఒంటి పూట బడులు ప్రారంభం కానున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు మాత్రమే నిర్వహించాలన్నారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలు నిర్వహించే పాఠశాలల్లో ఏ రోజు అయితే పరీక్ష ఉంటుందో ఆరోజు పాఠశాలకు సెలవు ఉంటుందన్నారు. పరీక్షా కాలపు సెలవులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సెలవు దినాల్లో పూర్తిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

గంట ముందుగానే చేరుకోవాలి

పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులు గంట ముందుగానే పరీక్షాకేంద్రాల వద్దకు చేరుకోవాలని ఎంఈఓ తెలిపారు. జూపాడుబంగ్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అన్నిసౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

మల్లన్న సన్నిధిలో ఈటెల



స్వామిఅమ్మవార్ల దర్శనానికి వెళ్తున్న మాజీ మంత్రి ఈటెల రాజేందర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను ఆదివారం తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఎమ్మెల్యే (బీజేపీ), మాజీ మంత్రి ఈటెల రాజేందర్ దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.

శివాజీ స్ఫూర్తి కేంద్రం సందర్శన

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ఈటెల రాజేందర్ సందర్శించారు. స్ఫూర్తి కేంద్రం మేనేజర్ వంశీకృష్ణ సాదరంగా ఆహ్వానం పలికి శివాజీ సభా మండపం , ఆయన కాంస్య విగ్రహం, శివాజీకి సంబంధించిన సమాచార చిత్రపటాల గురించి వివరించారు. స్థానిక శివోహం ట్రస్ట్ అధ్యక్షులు అంతిరెడ్డి, అరవిందరెడ్డి మాజీ మంత్రి ఈటెలను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం మహిళలు

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట మైనార్టీ కాలనీకి పది రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో ఆ కాలనీవాసులు దాహంతో అల్లాడిపోతున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం కాలనీకి చెందిన మిస్లిం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్నామని తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత మండల పంచాయతీ అధికారులు స్పందించి మైనార్టీ కాలనీకి తాగునీటి సరఫరాను పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు చేపట్టాలని కాలనీకి చెందిన మహిళలు కోరుతున్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న వృషభాలు

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ పెద్దల సమక్షంలో అంతరాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ఆదివారం నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో కర్నూలు జిల్లా పంచలింగాల గ్రామానికి బైరపోగు సుంకన్న బ్రదర్స్ ఎద్దులు మొదటి బహుమతి రూ.30,016, అనంతపురం వీరన్నపల్లి గ్రామం నుంచి చెన్నారెడ్డి రెండో బహుమతి రూ.20,016, నంద్యాల జిల్లా ఎస్.కొత్తపల్లికి చెందిన నేతుల వెంకటేశ్వర్లు మూడో బహుమతి రూ.15,016 గెలుచుకున్నాయి. గిడ్డయ్య నాయుడు, శ్రీనివాసులు వృషభాలు నాల్గవ బహుమతి రూ.10,016, బోయ హేమంత్ ప్రసాద్ ఎడ్లు ఐదో బహుమతి రూ. 6016, దాపరనేని భాస్కరరెడ్డి ఆరో బహుమతి రూ.5016, యగాల నరసయ్య ఏడో బహుమతి రూ.4016, మంగలి బాబు వృషభాలు ఎనిమిదో బహుమతి రూ.2016 దక్కించుకున్నాయి.

ప్రపంచానికి ఆదర్శం.. యేసు జీవితం

- భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం
- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు



గువ్వలకుంట్ల చర్చి వద్ద మట్టల ఆదివారాన్ని జరుపుకుంటున్న దృశ్యం

పగిడ్యాల: సర్వ మానవాళి పాప విమోచనం కొరకు సిలువపై ప్రాణ త్యాగం చేసి మృత్యుంజయుడుగా తిరిగి లేచిన యేసుక్రీస్తు జీవితం ప్రపంచానికి ఆదర్శమని పాస్టర్ సౌవందరాజు అన్నారు. ఆదివారం మండలంలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పగిడ్యాల, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట, ఎం. ఘణపురం తదితర గ్రామాల్లోని క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈత మట్టలు చేత బూని యేసుక్రీస్తుకు జయమని నినదించారు. ఈస్టర్(పునరుత్థానం) పండుగను పురస్కరించుకుని క్రైస్తవులు నలువది రోజులు ఉపవాస దినాలను పాటిస్తూ యేసు పొందిన శ్రమలను జ్ఞాపకం చేసుకున్నారు.

యేసు బాటలో నడవాలి

నందికొట్కూరు: సకల మానవాళికి లోక రక్షకుడైన ఏసుక్రీస్తు బాటలో అందరూ నడవాలని సీఎస్ఐ చర్చి ఫాదర్ రెవరెండ్ ఉత్తమ్ వరబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవ సోదరులు, పిల్లలందరూ ఆదివారం ఈతమట్టలతో ఘనంగా పండుగను నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్ఐ టౌన్ చర్చి కార్యదర్శి అమల్ కుమార్, ఆయా సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో మట్టల పండుగను నిర్వహించారు. తాటిపాడు, జూపాడుబంగ్లా, తరిగోపుల, తంగడంచ, తర్తూరు, పారుమంచాల, తూడిచెర్ల, మండ్లెం, 80బన్నూరు తదితర గ్రామాల్లోని చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఈతమట్టలను చేతపట్టుకొని ఆయా గ్రామాల్లోని పురవీధుల్లో దేవుని కీర్తనలు పాడుతూ ఊరేగింపు నిర్వహించారు.

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో ఈస్టర్ పర్వదినం పురస్కరించుకొని క్రైస్తవ మత బోధకులు, క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈత మట్టలు చేతపట్టి గ్రామంలోని వీధుల వెంట ప్రార్థన గీతాలతో ఎంతో ఆనందంతో మట్టల పండుగను జరుపుకొన్నారు.

పాములపాడు: మండలంలో ఆదివారం మట్టల పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. బానుముక్కల గ్రామంలోని చర్చిలో ఫాదర్ రెవరెండ్ ప్రసాద్‌బాబు మట్టల ఆదివారం విశిష్టను వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఈత మట్టల చేతబూని గుడి ప్రదర్శన చేశారు.

శ్రీశైలం ప్రాజెక్టు : శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలోని అన్ని చర్చీలను మట్టల ఆదివారం సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆశీర్వాద సూచనగా మట్టలను చేతపట్టి క్రైస్తవ చిన్నారులు పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

మహానంది: మద్యానికి డబ్బులివ్వలేదని మనస్తాపానికి గురైన దాట్ల నాగేశ్వరరావు(25) రెండ్రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్సై నాగార్జున రెడ్డి ఆదివారం తెలిపారు. బొల్లవరం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు మద్యానికి అలవాటు పడ్డాడు. దీంతో శుక్రవారం మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని అమ్మను అడిగాడు. ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతను కోలుకోలేక శనివారం సాయంత్రం మృతి చెందాడని చెప్పారు. తల్లి దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు వెల్లడించారు.

శ్రీశైలంలో ఢిల్లీ కన్స్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్



జస్టిస్ డాక్టర్ సంగీతా దింగ్ర నెహగల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రెడ్‌క్రాస్ సభ్యులు

శ్రీశైలం టెంపుల్ : ఢిల్లీ కన్స్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ జస్టిస్ డాక్టర్ సంగీతా దింగ్ర నెహగల్ కుటుంబ సమేతంగా భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం ఆదివారం శ్రీశైలం వచ్చారు. వీరికి రెడ్‌క్రాస్ శ్రీశైలం బ్రాంచ్ చైర్మన్ నాగ శేషయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే శ్రీశైలం రెడ్‌క్రాస్ బ్రాంచ్ తరపున సేవా కార్యక్రమాలను, శివరాత్రి, ఉగాది పర్వదినాలకు భక్తుల సౌకర్యార్థం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల గురించి వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు జీవీకేఎస్ ప్రసాద్, జాని తదితరులు ఉన్నారు.

ఆదిత్య పుష్పం



ఆకుల మధ్య పుష్పంలా కనిపిస్తున్న ఆదిత్యుడు

మహానంది: అందాలను ఆవిష్కరించడంలో ప్రకృతిని మించిన చిత్రకారుడు ఉండడు. సూర్యోదయం , సంధ్య వేళలో ఆవిష్కృతమయ్యే అందాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తుంటాయి. అందులో భాగంగా మహానందిలో సూర్యోదయం వేళ ఆదిత్యుడు ఆకుల మధ్యలో పుష్పంగా ఒదిగిపోయిన దృశ్యం కనువిందు చేసింది.

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం



పాములపాడు ఏఎన్ఆర్ జెడ్పీహైస్కూలులో గదిని పరిశీలిస్తున్న చీఫ్ కృష్ణమూర్తి

మహానంది: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ రామసుబ్బయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మహానంది మండలంలోని 11 పాఠశాలల నుంచి 454 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. గాజులపల్లెలో రెండు సెంటర్లు ఏర్పాటు చేశారని, జిల్లా పరిషత్ పాఠశాల, క్రీస్తుజ్యోతి పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఒక కేంద్రంలో 165, మరో కేంద్రంలో 184 మంది పరీక్షలు రాస్తారని చెప్పారు.

నందికొట్కూరు: ఆరు సెంటర్లలో జరిగే పది పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ ఫైజున్నీసా బేగం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు పరీక్ష కేంద్రాలకు గాను 1,470 విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తునట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1,200 మంది విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 270 మంది విద్యార్థులు, పరీక్షలు రాసేందుకు అన్ని సదుపాయలు కల్పించామన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

పాములపాడు: మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ జెడ్పీహైస్కూలు (పరీక్ష కేంద్రం- 1)లో ఏర్పాట్లను చీఫ్ కృష్ణమూర్తి ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. 8.30లకు విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడునని వివరించారు. స్థానిక ఏపీ మోడల్ స్కూలు (పరీక్షా కేంద్రం – 2)లో 155 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని చెప్పారు. ఒక్కో సెంటరుకు 13 మంది సిబ్బందిని నియమించామన్నారు.

ఆదర్శ పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో పదోతరగతి పరీక్షలు జరుగుతాయని పరీక్షల నిర్వహణ అధికారి సలీం బాషా ఆదివారం తెలిపారు. ఉదయం 8.30 గంటలకు విద్యార్థులు ఆయా పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని, 9.30 పరీక్షా మొదలవుతుందని చెప్పారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రిక్ పరికరాలు అనుమతించరన్నారు. పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుదని చెప్పారు. 9.30 గంటలు దాటి ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు.

హనుమద్వాహనంపై లక్ష్మీరంగనాథుడు



హనుమద్వాహనాన్ని ఊరేగిస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం శ్రీ లక్ష్మీరంగనాథుడు హనుమద్వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తుండగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పుష్పార్చన, కుంకుమార్చన తదితర విశేషపూజలు చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రభోత్సవ వాహనంపై ఉన్న హనుమద్వాహనంపై ఉంచారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఈశ్వరరెడ్డి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం స్వామి వారికి గరుడ వాహన సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ, చైర్మన్ ప్రతాపరెడ్డి తెలిపారు.



మహానంది కోనేరులో భక్తుల స్నానాలు

మహానందిలో సండే సందడి

మహానంది: మహానంది ఆలయంలో ఆదివారం భక్తులసందడి నెలకొంది. సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాల్లో సందడి నెలకొంది. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక రుద్రగుండం, బ్రహ్మ, విష్ణుగుండం కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి ప్రారంభమైన దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.